# మగసిరి




నేను భయపడినంతా జరిగింది. రెండవ కాన్పులోనూ ఆడపిల్లే పుట్టినప్పుడు చలపతికి చెప్పాను. మగపిల్ల వాడి కోసం ముచ్చటగా మూడోసారి చూద్దాం అనుకోవద్దని. నా మాట వింటేనా?

పుత్రుడంటే పున్నామనరకం నుండి రక్షించే వాడంటూ మొండిగా మాట్లాడాడు.

మనం చచ్చాక నరకం తప్పించటం సంగతి అట్లా వుంచు. బ్రతికినంత కాలం మోయవలసిన బరువు బాధ్యతల సంగతి ఆలోచించమన్నాను. వాడి చెవిలో దూరితేనా?

చలపతికి జాతకాల పిచ్చి జాస్తిగానే వుంది. మూడోసారి మగబిడ్డ పుడతాడని బ్రహ్మ జాతకంలో రాసేడన్నాడు.

అసలు ఆ బ్రహ్మ అనేవాడు రాసిందే జరిగిందో! లేక వూహించటంలో జ్యోతిష్యుడే పప్పులో కాలేసాడో! జరగవలసింది జరిగింది. భయపడ్డ దానికంటే పెద్ద ప్రమాదమే జరిగింది. మూడో కాన్పులో ఏకంగా కవల ఆడ పిల్లలు పుట్టారు.

నాకు చలపతితో వున్న సాన్నిహిత్యాన్ని బట్టి చూస్తే ఈ వార్త నాకు కాస్త ఆలస్యంగా చేరిందనే చెప్పాలి. అదే వాడనుకున్నట్లు జరిగివుంటే కథ వేరొకలా వుండేది. ఈ కథా నేను చెప్పకపోదును.

అతడూ, నేనూ ఒకే ఆఫీసులో పని చేయటం లేదు గాని ఒకే వూరిలో పుట్టిన వాళ్ళం. ఆ రకంగా మా కుటుంబాల మధ్య గట్టి స్నేహ సంబంధాలున్నాయి.

సాయంత్రం నేనూ, నా భార్య ఆసుపత్రికి వెళ్లాం.

పిల్లలు పసిడి ముద్దల్లా, ఆరోగ్యంగా వున్నారు. ఆసుపత్రి గదుల్లో వున్న వాళ్ళు కూడా ఆసక్తిగా వచ్చి చూసి పోతున్నారు. పండంటి పిల్లలమ్మా అంటూ ముద్దు చేసి పోతున్నారు.

"చలపతి ఏడి?" అడిగాను.

ఆవిడ కళ్ళల్లో గిర్రున నీళ్ళు తిరిగాయి. ఒక పట్టాన గొంతు పెగల్లేదు. సభ్యతా, సంస్కారం అడ్డొచ్చి గాని గొల్లుమని ఏడ్చేలా వున్నది.

"ఏం చెప్పను. నిన్న అలా తొంగి చూసి పోయారు. మళ్ళీ అయిపులేరు. నాతో పన్నెత్తి మాట్లాడటం గాని, పిల్లల్ని కన్నెత్తి చూడటం గాని లేదు. బిడ్డల్ని కన్నతల్లికి ఇంతకన్నా అవమానం ఏముంటుంది?" కన్నీళ్ళతో చెప్పింది.

"నువ్వంతగా బాధపడకమ్మా! మగబిడ్డ కావాలనుకున్నారు గదా! నిరాశ పడ్డారేమో!" అన్నది నా భార్య.

"రెండవ కాన్పప్పుడే చెప్పాను. మగో, ఆడో ఎవరు చెప్పగలరు, ఆపరేషన్ చేయించుకుంటానని. నన్ను నోరెత్తనివ్వలేదు. ఇంతా జరిగాక నేను చెడ్డ దాన్నయ్యాను" కళ్ళొత్తుకున్నది.

"వూరుకోమ్మా! నాలుగు రోజుల్లో వాడే సమాధాన పడతాడు. నేనూ నాలుగు చివాట్లు పెడతాను" అన్నాను ఓదార్పుగా.

"ఈ విషయం మీరేం ప్రస్తావించకండన్నయ్యా! మీకేదో నూరిపోసేనని నన్ను ఆడి పోసుకుంటారు" అన్నది భయంగా.

మర్నాడు, మాసిన గడ్డంతో, దీనంగా, సర్వస్వం పోగొట్టుకున్న వాడిలా సాక్షాత్కరించాడు చలపతి.

"కంగ్రాట్స్! కవల పిల్లల తండ్రి వయ్యావు. ఆడపిల్ల పుట్టిందంటే లక్ష్మి ఇంట అడుగుపెట్టిందంటారు. అదృష్టమంటే నీది. జంట లక్ష్ములు నీ ఇంట ఉదయించారు" అన్నాను చిరునవ్వుతో.

"జంటేం కర్మ. ఏకంగా చతుష్టయంగానే అవతరిస్తేను" అన్నాడు ఏడుపు ముఖంతో.

"కష్టే ఫలే అన్నారు. మరో ఎటెంప్ట్ చెయ్యి" అన్నాను, భుజం తడుతూ.

వాడికి ఏడుపే తక్కువ. "నువ్వూ నన్ను ఎగతాళి పట్టిస్తున్నావా?" అన్నాడు.

"లేకపోతే, ఈ అవతారం ఏమిటి? రోట్లో తల దూర్చేటప్పుడే వుండాలి బుద్ధి. ఇకనైనా బ్రహ్మరాతలు, జాతకాలు అంటూ వేలాడకు" అన్నాను సుతిమెత్తగా చివాట్లేస్తూ.

రెండ్రోజుల దాకా వెళ్ళేందుకు నాకు వీలు కుదిరింది కాదు. నా భార్య వెళ్ళొచ్చింది. వస్తూనే సిసింద్రీలా నా మీద విరుచుకు పడింది.

"మీ మగాళ్ళంతా ఇంతే. నోరు లేదు కదాని ఆడవాళ్ళంటే అంత చులకనా!"

"మీకు నోరులేదన్న వాడెవడు! ఇంత సాక్ష్యం నువ్వుండగాను" అన్నాను కాస్త తగ్గుతూనే.

"పైకి సాధువుల్లా వుంటారు గాని మీరు గుండెలు దీసిన బంటులు. మూడు ముళ్ళు వేసినంత మాత్రాన అన్నదానికల్లా పడుండాలా! మాకూ ఒక వ్యక్తిత్వం వుంటుందన్న జ్ఞానం మీకుండొద్దూ...." అరుస్తున్నది.

చెప్పొద్దూ. నాకూ భయం వేసింది. "బాగుంది నీ వరస. నిష్కారణంగా నాతో తగువాడతావేమిటి?" అన్నాను.

దూకుడు తగ్గింది. "మీరంటే మీరనా! మీ స్నేహితుడి నిర్వాకం. ఆవిడ్ని రాసి రంపాన పెడుతున్నారట. స్త్రీ జన్మకు సార్థకత మగ బిడ్డను కన్నప్పుడేనట. అందరూ పండంటి మగపిల్లల్ని కంటుంటే ఏకంగా నలుగురు ఆడపిల్లల్ని కన్నావు. నిన్ను కట్టుకున్నందుకు నా నెత్తిన శని నెక్కించావు అంటూ ఒకటే దెప్పటమట."

"వ్యవహారం ముదురుతున్నదన్నమాట. అయితే ముదరక ముందే కత్తిరించాలి" అన్నాను నింపాదిగా.

"ఆవిడ ఒకటే ఏడుపు. 'ఆడో మగో కావాలనుకుని, చూసి మరీ కంటామా! దైవ సంకల్పం. ఈ నిందలు నేను భరించలేను. పిల్లల ముఖాలు చూసి గాని ఏనుయ్యో, గొయ్యో చూసుకుందామనిపిస్తున్నది' అంటున్నది. మీరన్నా అతగాడికి గట్టిగా బుద్ధి చెప్పండి" అన్నది కోపంగా.

కాసేపు ఆలోచించాను. "దీనికి విరుగుడుగా నేనొక ఉపాయం చెప్తాను. చెప్పినట్లు చేయమను. దాంతో వాడి తిక్క కుదురుతుందేమో!" అంతా వివరంగా చెప్పి పంపాను.

నాలుగు రోజుల్లోనే తిరిగి చలపతి దర్శన మిచ్చాడు. ఈసారి మనిషి కుతకుత వుడుకుతున్న కుండలా అగుపించాడు. మూకుడు తియ్యటమే ఆలస్యం ఆవిర్లు గక్కేలా వున్నాడు.

"ఏమిత్రా! ఇంకా పిల్లల గురించేనా ఆలోచన?" అడిగాను సావధానంగా.

"కాదు. ఈ పిల్లల తల్లి గురించి" అన్నాడు సమాధానంగా.

"ఏం! ఒంట్లో బాగోలేదా?"

"మనిషికేం! మతేలేనట్లుంది. మొగుడన్న గౌరవం లేకుండా మాట్లాడుతున్నది. గడ్డిపోచలా తీసి పారేస్తున్నది" అన్నాడు ఉక్రోషంగా.

"నీ బుద్ధి వారి తప్పకపోతే ఇంతదాక వస్తుందా! నువ్వు ఏదో అనే వుంటావు."

"మనసు కష్టపడి అంటే మాత్రం అంతంత మాటలంటుందా?"

"ఎంతెంత మాటలేమిటి?" అన్నాను నిగ్గదీస్తూ.

"ఆడపిల్లల్ని కనవలసి రావటం తన దౌర్భాగ్యమట. నా రాత బాగుంటే పండంటి మగపిల్ల వాడినే కనేదట. తన ముచ్చట ఈ విధంగా ముక్క లయిందట. నన్ను అనటం సంగతి అలావుంచు. ఇంటికి వచ్చిన వాళ్ళందరి దగ్గరా ఇదే సొద. తలెత్తుకోలేక పోతున్నాను. కన్నది తను. తప్పంతా నా మీద బనాయిస్తున్నది. ఇదంతా తలతిక్క కాకపోతే ఏమన్నా వుందా?" అన్నాడు ఆవేశపడుతూ.

"ఆవిడ అన్నదాంట్లో తప్పు పట్టవలసింది ఏమీ కనపడటం లేదు" అన్నాను తాపీగా.

ఉలిక్కి పడ్డాడు. ముఖం మాడు చెక్కలా నల్లబడింది.

"ఆవిడ మగ బిడ్డల్ని కనలేక పోవటం నా చేతగాని తనమంటావా?"

"తెగేదాకా లాగావు గనుక నిజం చెప్పాలంటే అంతే. పుట్టే బిడ్డ ఆడో, మగో నిర్ణయించేది మగవాడు. మగబిడ్డను కంటేనే స్త్రీ జన్మ సార్థకమవుతుందని నువ్వనుకుంటే అది నీ వల్లనే సాధ్యం. స్త్రీ అండంలో x x క్రోమోజోములు వుంటాయి. అదే పురుషుడి బీజకణాల్లో x y క్రోమోజోములు వుంటాయి.

పురుషుడి x క్రోమోజోమ్ స్త్రీలో వున్న x క్రోమోజోమ్‌తో కలిస్తే ఆడపిల్ల పుడుతుంది. అదే పురుషుడి y క్రోమోజోమ్ వెళ్ళి కలిస్తే అబ్బాయి పుడతాడు. ఇదంతా ఒక యాక్సిడెంట్ లాంటిది. తెలియని నీ లాంటి అజ్ఞానులు ఆడవాళ్ళను నిందిస్తారు. అసలు నిజానికి డిసైడింగ్ ఫ్యాక్టర్ మగాడే!" వివరంగా చెప్పాను చలపతికి.

చలపతి నోరెత్తలేదు. గొణుక్కుంటూ వెళ్ళిపోయాడు.

"అన్నయ్య గారు వేసిన మంత్రం మా వారి మీద బాగానే పని చేసింది. ఇప్పుడు ఏ గొడవలూ లేవు. బుద్ధిగా వుంటున్నారు" అని సంతోషపడ్డదట చలపతి భార్య.

ఆ తర్వాత కొద్ది రోజులకే మరో ఎటెంప్ట్ చేయకుండానే, పిల్లలు పుట్టకుండా వేసెక్టమీ చేయించుకున్నాడు చలపతి.

❋

*(జనవరి 1989, ఆకాశవాణి ద్వారా ప్రసారం)*